# తెలంగాణ రాష్ట్ర గొర్రెల మరియు మేకల అభివృద్ధి సహకార సంస్థ

## అమేజ్ బీమా సలహాదారుల సేవా సహకారంతో

## నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ ద్వారా అమలుచేస్తున్న గొర్రెల బీమా పథకం

# సంస్థ నుండి గొర్లకు లోన్ తీసుకునే లబ్ధిదారులకు సలహాలు

**ఈ పథకం మన బంగారు తెలంగాణలో మన గొర్రెల పెంపకందారులకు ప్రభుత్వం ఇచ్చే మొదటి పథకం**

ఈ పథకం క్రింద గొర్ల ధరలో 20% సబ్సిడీని కేంద్రప్రభుత్వం, బీమా ప్రీమీయంలో దాదాపు 70% సబ్సిడీని మన రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్నాయి. అలాగే లోన్‌పై పావలా వడ్డీ సదుపాయాన్నికూడా మన రాష్ట్రప్రభుత్వం కల్పిస్తుంది. మనకు యిచ్చే పథకాలను సద్వినియోగం చేసుకుంటే రాబోయే కాలంలో ఇంకా మేలు చేసేందుకు ఇంకా మంచి పథకాలను మన ప్రభుత్వం ప్రవేశపెడ్తుందనే భరోసా మనకుంది.

మన బాగు మన చేతల్లో, మనచేతుల్లో ఉంది! అది ఏలాగంటే?

**1. గొర్లకు పోగులు వేయించుకోవడం - సరైన ఫోటోలు తీయించుకోవడం.**

ఇప్పుడు ప్రవేశపెట్టిన పథకం అంతా గొర్లకు వేసే పోగులమీదనే ఆధారపడి ఉంది. కాబట్టి ప్రతి లబ్ధిదారుడు అన్ని గొర్లకు, (పథకం క్రింద కొన్న అన్ని గొర్లకు) ఖచ్చితంగా చెవిపోగును సరైన పద్ధతిలో భద్రంగా వేయించుకోవాలి. అలా పోగు వేసిన గొర్లకు చెవిపోగు నంబరు కనపడే విధంగా ఫోటోలు తీయించుకుని కంప్యూటర్లలో ఎక్కించుకోవాలి. దీనికి గాను పశువుల డాక్టరును అడిగి పోగులను వేయించడంలో మరియు ఫొటోలు తీసి కంప్యూటర్లో ఎక్కించడంలో వారి పూర్తి సహాయ సహకారాలను మన గొర్ల పెంపకందార్ల సంఘం ద్వారా పొంది మన గొర్లను, చెవిపోగు నంబర్లను, ఫోటోలను జాగ్రత్తగా నమోదు పరుచుకోవాలి. దీనిలో ఏ మాత్రం అజాగ్రత్తగా ఉన్నా గొర్లు చనిపోయినప్పుడు బీమా రాదనే విషయాన్ని గమనించాలి.

ఇంతవరకూ గొర్లను బీమా చేయించేటప్పుడు చెవిపోగుతో ఫొటో తీయడం అనే పద్ధతిలేదు. అయితే ఈ పథకం క్రింద ఈ చెవిపోగుతో ఫొటో విధానం ద్వారా గొర్లు చనిపోయినప్పుడు క్లెయిమ్‌లు వెంటనే వచ్చే వీలు కల్పించారు, చనిపోయినప్పుడు కూడా చెవిపోగు నంబరు కనపడే విధంగా జీవం తల ఫొటోను, లబ్ధిదారుడు జీవం ప్రక్కన ఉన్న ఫొటోను పంపించాలి. అప్పుడు బీమా చేయించినప్పుడు ఉన్న ఫొటోను దానిలోని పోగునంబరును, చనిపోయినప్పటి ఫొటోలతో పోల్చి చూసి క్లెయిమ్‌లు చెల్లిస్తారు. కాబట్టి లబ్ధిదారులకు వెంటనే క్లెయిమ్‌లు చెల్లించే వెసులుబాటు ఉంది.

ఈ ఫొటో విధానాన్ని అమేజ్ బీమా సలహాదారుల సలహామేరకు ప్రవేశపెట్టడం జరిగింది. దానికి తగిన కంప్యూటర్ విధానాన్ని కూడా వారు రూపొందించారు. వారిని ఎటువంటి సలహాకైనా, సమస్యకైనా సంప్రదించేవిధంగా మన సహకార సంస్థ వారిని నియమించింది. అలాగే ఈ గొర్ల బీమాకు అతి తక్కువ ప్రీమియంతో ముందుకు వచ్చిన ప్రభుత్వ రంగ సంస్థ అయిన నేషనల్ ఇన్సూరెన్స్ కంపెనీ వారిని మన ప్రభుత్వం ఈ పథకం అమలుకు ఎంపిక చేసింది.

**2. గొర్లు చనిపోయినప్పుడు మనం చేయవలసిన పనులు :**

గొర్లు చనిపోయిన వెంటనే మన సంఘానికి, పశువుల డాక్టరుకు వెంటనే తెలియజేయాలి, (మొబైల్ ఫోన్ ద్వారా). చనిపోయిన జీవాన్ని/జీవాలను డాక్టరు గారు పరీక్ష నిమిత్తం ఎక్కడకు తీసుకురమ్మంటే అక్కడికి తీసుకువెళ్లాలి. అలా తీసుకెళ్లిన తర్వాత డాక్టరు చనిపోయిన గొర్రెను పరీక్షిస్తాడు. ఎందుకు చనిపోయిందన్న కారణాన్ని నిర్ధారిస్తాడు. అలాగే గొర్రె చనిపోయిన విషయాన్ని అమేజ్ బీమా సలహాదారులకు నేషనల్ ఇన్సూరెన్స్ వారికి తేది మొదలగు వివరాలతో తెలియజేస్తాడు.

- ♦ చనిపోయిన గొర్రె చెవిపోగు నంబర్ (తల భాగంతో పాటు) కనపడేవిధంగా ఒక ఫొటో, లబ్ధిదారుడు జీవం పక్కన ఉన్న ఫొటో ఒకటి తీస్తాడు.
- ♦ తర్వాత క్లెయిమ్ పత్రాన్ని నింపి లబ్ధిదారుని సంతకాలు/ వేలి ముద్రలు తీసుకుని దాన్ని కూడా ఫొటో తీస్తాడు.
- ♦ వీటన్నిటిని అమేజ్ బీమా సలహాదారులకు మరియు నేషనల్ ఇన్సూరెన్స్ వారికి మొబైల్‌ద్వారా , కంప్యూటర్ ద్వార పంపిస్తారు.
- ♦ ఇవన్నీ పూర్తి చేయాల్సిన బాధ్యత లబ్ధిదారులదే.

దీని తర్వాత చెవిపోగును జీవం చెవినుంచి వేరుచేసి క్లెయిం ఫారంకు జతచేసి అమేజ్ బీమా సలహాదారులకు పోస్టు ద్వారా వెంటనే పంపాలి. ఇట్టి క్లెయింఫారం మరియు చెవిపోగు పోస్టుద్వారా అందిన తర్వాతనే క్లెయిం చెల్లిస్తారు. కాబట్టి చాలా జాగ్రత్త వహించాలి. డాక్టరు గారి సహాయం మీ సంఘం సహాయం పూర్తిగా తీసుకోవాలి. ఇలా పంపిన 15 రోజుల తర్వాత మీ క్లెయిమ్ పరిస్థితిని అమేజ్ బీమా సలహాదారులను మొబైల్ ద్వారా సంప్రదించి తెలుసుకోండి. వారు ఈ విషయంలో అన్నిరకాలుగా సేవలు అందిస్తారు. ఇలా చెల్లించిన క్లెయిమ్ డబ్బును మీ జిల్లా సహకార సంఘంలోని మీ ఖాతకు డైరెక్టుగా జమచేయడం జరుగుతుంది. ఈ వివరాలు కంప్యూటర్లో పొందుపరుస్తారు. డాక్టరు గారిని సంప్రదించి ఒకవేళ మీకు 30 రోజులుల తర్వాత కూడా క్లెయిమ్ చెల్లించని పక్షంలో మీరు అమేజ్ బీమా సలహాదారులను సంప్రదించి వారి సలహాలను పాటించగలరు. అలాగే మీ జిల్లా సంఘాన్ని కూడా సంప్రదించగలరు.

### 3. గొర్ల చెవిపోగు పడిపోయినప్పుడు లేదా విరిగిపోయినప్పుడు పాటించాల్సిన పద్ధతులు :

చెవిపోగు జీవాల బీమాలో అతి ముఖ్యమైన భాగం. ఎందుకంటే చెవిపోగులేకుంటే క్లెయిమ్ ఇవ్వరు. ఒకవేళ చెవిపోగు పడిపోయిన/ విరిగిపోయిన తర్వాత జీవం చనిపోతే మీరు ఎంత ప్రయత్నించిన క్లెయిమ్ రాదు. నేను చూసుకోలేదు అన్నా లాభం లేదు. కాబట్టి ప్రతిరోజు జీవాలకు చెవిపోగు ఉందో లేదో అనే దాన్ని ఖచ్చితంగా సరిచూసుకోవాలి. ఒకవేళ ఏ జీవానికైనా చెవిపోగు పడిపోతే ఆ విషయాన్ని వెంటనే డాక్టరుగారికి తెలియజేయాలి. పడిపోయిన / విరిగిపోయిన చెవిపోగు దొరికితే ఆ పోగు నంబరు తెలియజేయాలి. ఒక వేళ పడిపోయిన చెవిపోగు దొరకని పక్షంలో మిగతా జీవాల పోగు నంబర్లు రాసుకుని డాక్టరు గారి దగ్గరకు వెళితే, ఆయన కంప్యూటర్లో చూసి పడిపోయిన పోగు నంబరు నిర్ధారిస్తాడు. తర్వాత డాక్టరు గారు తన దగ్గర ఉన్న కొత్త చెవిపోగును జీవానికి వేస్తాడు. అలాగే దానికి సంబంధించిన ఫారాన్ని నింపి లబ్దిదారుని సంతకం కూడా తీసుకుని దాన్ని ఇన్సూరెన్స్ వారికి కంప్యూటర్ ద్వారా / మొబైల్ ద్వారా తెలియజేస్తాడు. మీరు ఎల్లప్పుడు మీ ఆధార్ కార్డును తీసుకెళ్లండి. ఎందుకంటే ఆధార్ నంబర్ ద్వారానే మీ వివరాలు, గొర్ల వివరాలు కంప్యూటర్లో పొందుపరుస్తారు.

ఈ వివరాల ఆధారంగా నేషనల్ ఇన్సూరెన్స్ వారు కొత్త పోగు వివరాలు పొందుపరుస్తారు. బీమా పత్రం ఇస్తారు. ఆ పత్రాన్ని కొత్త పోగు నంబరును అమేజ్ బీమా సలహాదారుల వారు కంప్యూటర్లో పొందుపరుస్తారు. చెవిపోగు పడిపోయినప్పుడు ఈ విధంగా ఇన్సూరెన్స్ వారికి తెలియజేసి కొత్త చెవిపోగు నమోదు చేయించుకోవాలి. అప్పడే ఆ గొర్రె చనిపోయినప్పుడు క్లెయిం చెల్లిస్తారు. ఇది అందరూ జాగ్రత్తగా గుర్తుంచుకుని ప్రతిరోజూ ఉదయం సాయంత్రం గొర్లను పరిశీలించి చెవిపోగులు గమనించాలి. ఏదైనా చెవిపోగు లేదని గుర్తించినపుడు వెంటనే పైన చెప్పిన విధానం పాటించాలి.

మన తెలంగాణ ప్రభుత్వం మన మంచి కొరకు అమలు చేస్తున్న ఈ పథకంలో అందరం సమిష్టిగా పాల్గొని ఎటువంటి అవకతవకలు జరుగకుండా ఎవ్వరైనా దుర్వినియోగపరచాలని చూస్తే వారిని తగిన విధంగా మందలించి మన తెలంగాణకు బంగారు తెలంగాణ సాధించే దిశగా ముందుకు వెళ్దాం.

ఇన్సూరెన్స్ వారు బీమా తర్వాత గ్రామాలకు టీములను పంపి జీవాలకు పోగులు వేశారా లేదా అనే విషయాన్ని నిర్ధారించుకుంటారు. అలా వచ్చినప్పుడు ఎవరి జీవాలకైనా పోగులు లేని పక్షంలో గాని లేదా జీవాలను తీసుకురాని పక్షంలో గాని అట్టివారి బీమా పాలసీని రద్దు చేస్తారు. తర్వాత కూడా వారికి బీమా కల్పించరు.అలాగే వారి విచారణలో క్లెయిమ్లు సరైనవికావని తేలిన పక్షంలో అట్టి క్లెయిమ్లు పెట్టిన వారి మీద తగిన కేసులు పెట్టే అవకాశం ఉంది. అలాగే అలాంటి క్లెయిమ్కు చెల్లించిన డబ్బును సంఘంవారి సహకారంతో తిరిగి వసూలు చేసుకుంటారు.

కాబట్టి మనమందరం ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుని, మన తెలంగాణ ఘనతను నిలబెట్టుకుందాం. ప్రభుత్వానికి మన మీద విశ్వాసాన్ని కల్పిద్దాం. తద్వారా మన ప్రభుత్వం మన కొరకు మరిన్ని గొప్ప పథకాలను ఇచ్చే విధంగా చూద్దాం.

**మన తెలంగాణ** **బంగారు తెలంగాణ**

**జైహింద్**